క్లుప్తంగా

మెరుగైన పేదల జీవన ప్రమాణాలు



మర్రిపూడిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

రంగంపేట: సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మర్రిపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఇంటింటికీ మేలు జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేసి మళ్లీ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వేము మాధవి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ మేడిది చక్రం, వేము చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండలో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై ఆనంద కుమార్

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో ఎస్సై డి.ఆనంద కుమార్ ఆధ్వర్యంలో గురువారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు ఉల్లంఘించిన వాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



తొస్సిపూడిలో స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న అధికారులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం వాహనాలను తనిఖీ చేశారు. అనపర్తి నుంచి చింతపల్లి వెళుతున్న ఒక వ్యక్తి బైక్‌పై రూ.1,05,790 నగదు తీసుకెళుతుండగా పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు రూ.50,000కు మించి నగదు, రూ.10,000 పైబడి విలువున్న ఆర్టికల్స్ తీసుకెళుతుంటే తగిన ఆధారాలు చూపించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బాబాకు పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా

పెదపూడి: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో బాబాకు గురువారం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం బాబాను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా పండితులు భక్తులకు ప్రవచనాలు చెప్పారు. షిరిడీ సాయిబాబా జీవిత చరిత్రను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి బాబాను దర్శించుకున్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



లక్ష్మీగణపతి ఆలయం వద్ద హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి స్వామి, గోలింగేశ్వర స్వాముల ఆలయాల్లో హుండీలను దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. లక్ష్మీగణపతి ఆలయ హుండీ ఆదాయం రూ. 9,73,964, గోలింగేశ్వర స్వామి హుండీ ఆదా యం రూ.2,98,985 వచ్చినట్లు ఆలయ ఈఓ ఎం.రాంబాబురెడ్డి తెలిపారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా సమయం



ఈస్టర్ పండగకు సిద్ధమైన కోరుకొండ ఆర్‌సీఎం చర్చి



కాపవరం బైబిల్ మిషన్ చర్చిలో క్రైస్తవులు



పశ్చిమగానుగూడెం లూథరన్ చర్చి వద్ద క్రైస్తవులు

- నేడు గుడ్‌ఫ్రైడే, ఎల్లుండి ఈస్టర్
- రేపటితో ముగియనున్న తపస్సు కాలం
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

మధురపూడి: నియోజకవర్గంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గుడ్‌ఫ్రైడే, ఎల్లుండి ఈస్టర్ పర్వదినాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. అలాగే ఫిబ్రవరి 14వ తేదీన ప్రారంభమైన క్రైస్తవుల తపస్సు కాలం శనివారంతో ముగుస్తుంది. ఏసుక్రీస్తు శిలువపై మరణించే ముందు రోజు గురువారం రాత్రి రోమన్ సైనికులకు పట్టుబడతారు. ఆ రాత్రే ఆయన ఆఖరి భోజనం చేస్తారు. దానిని పురస్కరించుకుని గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్ర, శని, ఆదివారాల్లో కూడా కొనసాగనున్నాయి.

ఆధ్యాత్మిక సందడి

మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని చర్చిల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో సుమారు 150 చర్చిలున్నాయి. వీటిలో 37 రోజులుగా ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. క్రైస్తవులు ఉపవాస దీక్షతో ప్రార్థనలు చేస్తున్నారు. ఫిబ్రవరి 14న ప్రారంభమైన ఉపవాసాలు ఈనెల 30 తేదీతో ముగుస్తాయి. 31న తేదీ ఆదివారం ఈస్టర్ పండగను నిర్వహించుకుంటారు.

మాలధారణ ప్రధానం

తపస్సు కాలంలో కొందరు క్రైస్తవులు మాలధారణ చేస్తారు. కోరుకొండ మండలంలో సుమారు 50 మంది మాలధారణ చేపట్టారు. వీరంతా తెల్లటి దుస్తులతో, మెడలో జపమాలను ధరించి 40 రోజుల పాటు నిష్ఠతో ఉపవాసాలు చేస్తారు. ఆర్‌సీఎంలో ఫాదర్స్ ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహించబడే ఈ తపస్సు కాలంలో మాలధారణ చేసిన వారు భక్తిశ్రద్ధలతో పార్థనల్లో పాల్గొంటారు.

5 నుంచి ధాన్యం కొనుగోళ్లు

రాజానగరం: మండలంలో రబీ వరి పంట కోతలు జరుగుతున్న నేపథ్యంలో ఏప్రిల్ 5 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించనున్నామని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామీ ఖాసిమ్ తెలిపారు. ఇందుకుగాను మండలంలో 16 కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. క్వింటాల్ గ్రేడ్ వన్ ధాన్యానికి రూ. 2203, గ్రేడ్ 2 ధాన్యానికి రూ. 2183 నిర్ణయించారన్నారు. మండలంలోని 3,341 హెక్టార్లలో రబీ వరి సాగు జరిగిందన్నారు. ఎంటీయూ 1121, ఎంటీయూ 3626, ఆర్‌ఎన్ఆర్ 15048 రకాలు ఎక్కువగా సాగు చేశారన్నారు.

చెత్తను తొలగించాలి



చినకొండేపూడి శివారున డంప్ చేసిన చెత్త

సీతానగరం: చినకొండేపూడి శివారున రోడ్డు పక్కన వేసిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ సిబ్బంది ట్రక్కులలో చెత్తను తీసుకువచ్చి ఇక్కడ వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని డంపింగ్ యార్డ్‌లో వేయకుండా, రోడ్డు పక్కనే డంప్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని మాజీ పంచాయతీ ఉప సర్పంచ్, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పోలినాటి నరసింహారావు అన్నారు. ఆ చెత్త నుంచి దుర్వాసన వెలువడుతోందని, ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. అక్కడి చెత్తకు అప్పుడప్పుడు పంచాయతీ సిబ్బంది నిప్పు పెడుతున్నారని, దాని నుంచి వెలువడే పొగతోనూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.

సత్యానికి ఆశీస్సులు.. అసత్యానికి శాపాలు



బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

బిక్కవోలు: సత్యంతో సహవాసం చేస్తే భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయని, అసత్యాన్ని పట్టుకు వేలాడితే శాపాలు వెంటాడతాయని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నిజాయతీగా ఉన్నాను కనుకే సత్య ప్రమాణం వల్ల తనకు సత్ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. తాను ఎవరినీ విమర్శించడానికి ఈ వ్యాఖ్యలు చేయడం లేదని, తనకు కేవలం భగవంతుడిపై ఉన్న విశ్వాసాన్ని తెలుపుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, వైఎస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, గువ్వల సత్తిరెడ్డి, జంగా గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో పేదల స్థితిగతులు మెరుగు



దివాన్‌చెరువులో మహిళతో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- దివాన్‌చెరువులో పర్యటన

రాజానగరం: రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో ప్రజల జీవన విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, ముఖ్యంగా పేదల ఆర్థిక స్థితిగతులు ఎంతగానో మెరుగయ్యాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దీనికి ప్రధాన కారణం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజారంజక పాలనేనన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి దివాన్ చెరువులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూనే, గడచిన ఐదేళ్లలో ఎమ్మెల్యేగా తాను చేసిన సేవలను వివరించారు. సంక్షేమ పథకాలకు అర్హులందరికీ పారదర్శకంగా అందజేశామన్నారు. దీనితో పాటు గ్రామాల అభివృద్ధికీ పెద్దపీట వేసినట్టు తెలిపారు. దివాన్ చెరువులో రూ.13.20 కోట్ల మేరకు అభివృద్ధి జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఇక్కడ కేవలం రూ.54 లక్షలు మాత్రమే ఖర్చు చేసిందని గుర్తు చేశారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ద్వారా రాష్ట్రంలో ఉన్న పేదరికం 12 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గిందన్నారు. రాష్ట్ర ప్రగతితో పాటు ప్రజా సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరో అవకాశం కల్పించాలన్నారు.

జక్కంపూడి గణేష్ పరామర్శ



జంబూపట్నంలో పరామర్శిస్తున్న జక్కంపూడి గణేష్

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలో పలువురిని గురువారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పరామర్శించారు. ఇటీవల కేతా రాంబాబు అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని గణేష్ పరామర్శించారు. అలాగే మాతృ వియోగంతో బాధపడుతున్న తేలు పెద్దకాపు, దేవపూజలు సత్యనారాయణ కుటుంబాలతో మాట్లాడారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ ఉల్లి గణ, మాజీ సర్పంచ్ నాగా సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ ఉల్లి చెల్లారావు, ఎస్సీసెల్ మండల కన్వీనర్ ఈతకోటి చినబాబు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి



కాపవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

బిక్కవోలు: రాష్ట్రంలో పేదలంతా గౌరవంగా జీవించేలా సంక్షేమ పథకాలు అమలు చేసి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండలంలోని కాపవరంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు సుపరిపాలన అందించారని కొనియాడారు. జగనన్న పాలనకు వైనాట్ 175 కష్టమేమీ కాదన్నారు. 2014లో చంద్రబాబు రుణాలు మాఫీ చేస్తానని రైతులు, అక్కచెల్లెమ్మలను మోసగించిన తీరును గుర్తు చేశారు. జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం కరోనా కష్టకాలంలో కూడా సాకులు చెప్పకుండా సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. జగనన్న పాలనలో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ మార్శెళ్ల భీష్ముడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, కర్రి గంగరాజు, ఉప సర్పంచ్ పోసిన గోపాలకృష్ణ, పంచాయతీ వార్డు సభ్యులు గంగులూరి సూరిబాబు, పడాల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



చీపురపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకుందామని ఆ పార్టీ నాయకులు కోరారు. మండలంలోని చీపురపల్లిలో సర్పంచ్ గోపిశెట్టి సత్య అనురాధ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్నెల వెంకట్రావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మన్నెల్లి మరియమ్మ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా జక్కంపూడి రాజా, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ తరఫున పోటీలో ఉన్నారన్నారు. వారికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను గెలిపించుకుంటే, ఆయనతో పాటు కుటుంబ సభ్యులైన జక్కంపూడి విజయలక్ష్మి, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, జక్కంపూడి గణేష్ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. టీడీపీ పాలనలో ప్రజల సమస్యలపై జక్కంపూడి విజయలక్ష్మి ఎన్నో పోరాటాలు చేశారని, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కూడా రైతులకు న్యాయం చేయాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ డొక్కా సురేష్, గొంతె పార్వతి, కరారపు మునికాంత, మార్గాని వరలక్ష్మి, నక్కా దేవి, బందిల మరియమ్మ, ఉద్దగిరి చిన అబ్బులు, గోపిశెట్టి తులసీరావు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

కడియం: కడియపులంక గ్రామదేవత మునలమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం అమ్మవారిని గరగ నృత్యాలు, మేళతాళాలు, కేరళ వాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు, హారతులు సమర్పించారు.

సచివాలయ మహిళా పోలీసుల పాత్ర కీలకం

కడియం: ఎన్నికల నిబంధనల అమలులో మహిళా పోలీసులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని సచివాలయ మహిళా పోలీసులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహిళా పోలీసులు ప్రతి రోజూ గ్రామంలో పర్యటించాలన్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు కనిపిస్తే తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో నిఘాను ఏర్పాటు చేసి, ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే కొత్తగా ఓటు వచ్చిన వారికి దాని వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణలో జరిగేందుకు కృషి చేయాలన్నారు.

చదువుకు ఆర్థిక సాయం



సుకన్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

కడియం: వేమగిరి గ్రామంలోని రాందాస్ పేటకు చెందిన కర్రి నూకాలమ్మ అనే వితంతువుకు ముగ్గురు ఆడపిల్లలు. వారిని చదివించేందుకు ఆమె ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే స్పందించి గురువారం రాజమహేంద్రవరం వీఎల్‌పురంలోని తన కార్యాలయంలో ఆ పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందజేశారు. పిల్లలను బాగా చదివించాలని నూకాలమ్మకు సూచించారు.

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ గ్రామంలోని కెల్ల సుకన్య కుటుంబానికి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందజేశారు. కరోనాలో భర్తను కోల్పోయి, దివ్యాంగ కుమారుడు, కుమార్తెతో సుకన్య ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న చందన నాగేశ్వర్ ఆమె ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని, తన వంతు సహకారం అందిస్తానని చందన హామీ ఇచ్చారు.

సీతారామలక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠ



గంద్రేడులో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మండలంలోని గంద్రేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారి కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, సర్పంచ్ కుడిపూడి మాధవీలత, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, జి.మామిడాడ ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, వుండ్రు సత్యనారాయణ, కుడిపూడి శ్రీను, కేతా శ్రీను, సాంబత్తుల చంటి, పుట్ట కాశిరాజు, పండు తదితరులు పాల్గొన్నారు.

పోసికుమార్‌కు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్‌కు హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి వృద్ధులు, దివ్యాంగులకు అందిస్తున్న సేవలను గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ముత్యాల పోసికుమార్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

టోఫెల్‌తో విద్యార్థులకు ఇంగ్లిషుపై ఆసక్తి



విద్యార్థినితో పాఠాలు చదివిస్తున్న డీవైఈవో నారాయణ

కంబాలచెరువు: ప్రాథమిక స్థాయి నుంచీ విద్యార్థులకు ధారాళంగా చదవడం, రాయడం, మాట్లాడడంపై అవగాహన కల్పించాలని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి, టోఫెల్ జిల్లా నోడల్ అధికారి ఈవీవీబీఎన్ నారాయణ ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక నారాయణపురం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొందరు విద్యార్థుల చేత బుక్స్ చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లిష్‌పై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు టోఫెల్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహాల ప్రతిష్ఠాపనా మహోత్సవం



విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా పూజలు చేస్తున్న పండితులు



స్వామివారిని దర్శించుకున్న చందన నాగేశ్వర్

కడియం: వీరవరంలోని హనుమ లక్ష్మణ సీతా సమేత శ్రీ కోదండ రామస్వామి, వేంకటేశ్వర స్వామి వార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠాపనా మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. పంచాయతీ కార్యాలయం వద్ద ఆలయాన్ని దాతలు, భక్తుల సహకారంతో ఇటీవలే పునర్నిర్మించారు. ఆలయంలో నూతన విగ్రహాలను ఉదయం 9.38 గంటలకు ప్రతిష్ఠించారు. వైఖానస ఆగమ పండితుడు ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో 12 మంది వేద పండితుల సమక్షంలో ఈ కార్యక్రమంలో అత్యంత వైభవంగా జరిగింది. ప్రతిష్ఠ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

దర్శించుకున్న ప్రముఖులు

రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు శ్రీ కోదండరామస్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

కార్మికుల సంక్షేమానికి జగన్ కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముద్దాల అను

రాజమహేంద్రవరం రూరల్: కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కార్మికుల పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను అన్నారు. బొమ్మూరు సెంటర్‌లో ఆయన అధ్యక్షతన గురువారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఆటో యూనియన్ నాయకులు ఎస్‌కే ఆలీ, ఎస్‌కే సమీరా, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగ రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ చేతుల మీదుగా కేక్ కట్ చేసి కార్మికులకు పంచారు. ఈ సందర్భంగా ముద్దాల అను మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండి, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా చెల్లుబోయిన వేణును, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు, దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, జీపీఆర్ జెడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్, ట్రేడ్ యూనియన్ రాజమండ్రి రూరల్ కన్వీనర్ కామేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్, కన్వీనర్ కేవీ సుబ్బారెడ్డి, సోమన శ్రీనివాస్, వల్లి శ్రీను మహిళా కార్మిక నేతలు రామలక్ష్మి, వెంకటలక్ష్మి, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.